సాక్షి ఏలూరు

శుక్రవారం : 26 : ఏప్రిల్ : 2024




వైఎస్సార్ సీపీ పేదల పక్షం

రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోందని, వైఎస్సార్‌సీపీ పేదల పక్షమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. IIలో ▸



సరస్వతీదేవిగా రాట్నాలమ్మ

రాట్నాలకుంటలో రాట్నాలమ్మ తిరునాళ్లలో భాగంగా అమ్మవారు మూడో రోజు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. IIలో ▸



భారీగా చేరికలు

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

కేవీకేల పాత్ర కీలకం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటలలో నూతన సాంకేతిక ద్వారా మరింత లాభసాటిగా సాగు, మార్కెటింగ్ సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి టి.జానకిరామ్ అన్నారు. యూనివర్సిటీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యాన, సస్యరక్షణ శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమం గురువారం రెండో రోజు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక విధానాలను రైతులకు పరిచయం చేయడంలో కేవీకేల పాత్ర ప్రముఖమన్నారు. నూతన పరిశోధనలు, వాటి ఫలితాలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనిచేసే కేవీకే శాస్త్రవేత్తలకు అందిస్తామన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్ నాయక్, విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ ఎల్.నారం నాయుడు మాట్లాడారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు ఏపీఆర్ఎస్ కామన్ అడ్మిషన్ టెస్ట్, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు డీసీ సెట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ఏపీఆర్ఎస్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌కు 2,185 మందికి 1,663 మంది హాజరయ్యారు. ఏపీఆర్‌జేసీ పరీక్షకు 1,935 మందికి 1,661 మంది హాజరయ్యారు. డీసీ సెట్ పరీక్షకు 51 మందికి 33 మంది హాజరయ్యారు. జిల్లాస్థాయి అబ్జర్వర్ డీఆర్‌ఓ ఒక కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖాధికారి ఒక కేంద్రాన్ని, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ 10 పరీక్షా కేంద్రాలను, ఏపీఆర్ఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ 10 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 7 కేంద్రాలను పర్యవేక్షించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ అబ్రహం తెలిపారు.

టీసీసీ పరీక్షలకు 23 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు గురువారం 23 మంది హాజరయ్యారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 33 మందికి 15 మంది, డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు 11 మందికి 8 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

భీమవరం: ఎన్నికల సంఘ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకత, నిష్పక్షపాతంతో ఎన్నికల విధులు నిర్వహించాలని సాధారణ ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలకుడు శైలేష్‌కుమార్ సిన్హా అన్నారు. ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించేందుకు జిల్లాకు విచ్చేసిన ఆయన భీమవరంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం పోలీస్ అధికారులతో సమీక్షించారు. పోలీసు అధికారులు చేపట్టాల్సిన విధులు, విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చెంతకు వచ్చి.. చింతలు తీర్చి

నేనున్నానని.. మీకేం కాదని..

- ఆపన్నులకు సీఎం జగన్ భరోసా
- సమస్యలు ఆలకించి.. సత్వర పరిష్కారానికి చర్యలు
- భీమవరంలో 11 మందికి గంటలోనే రూ.లక్ష చొప్పున సాయం
- ఉమ్మడి జిల్లా పర్యటనల్లో అండగా నిలిచిన ముఖ్యమంత్రి
- సత్వర స్పందనపై బాధితుల హర్షం



భీమడోలు మండలం పూళ్లకు చెందిన అందుగుల లాజర్ తనయుడు నవదీప్, నూతలపాటి మార్తమ్మ, యలమంచిలి మండలం కనకాయలంకకు చెందిన చిల్లే సుమతి సమస్య తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, భీమవరం: ఆపదంటూ వచ్చిన వారిని ఆదుకోవడమే కాదు.. వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారు. ఆయన ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా తన కోసం ఎదురుచూస్తున్న వారి చెంతకు వెళ్లి వారి చింతలు తీర్చడం పరిపాటి. అదే తరహాలో భీమవరం పర్యటనకు వచ్చిన సందర్భంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురి సమస్యలను ఆలకించిన సీఎం జగన్ గంటలోనే ప్రభుత్వ సాయం అందించి వారి బతుకుల్లో వెలుగులు నింపారు.

కేవలం గంట వ్యవధిలోనే..

జగనన్న విద్యాకానుక విడుదల చేసేందుకు 2023 డిసెంబరు 29న భీమవరం వచ్చిన సీఎం జగన్‌ను తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో హెలిప్యాడ్ వద్ద పలువురు కలిసి తమ ఇబ్బందులు తెలిపారు. వీరిలో అనారోగ్యంతో బాధపడుతున్నవారు కొందరైతే, భర్త మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న వారు మరికొందరు. వారి సమస్యలు విని వెంటనే స్పందించిన సీఎం జగన్ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సత్వర సాయం విడుదలకు అప్పటి కలెక్టర్ పి.ప్రశాంతికి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు కేవలం గంట వ్యవధిలోనే కలెక్టర్ ప్రశాంతి, అప్పటి జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించారు.

వెలుగులు నింపారంటూ..

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గుడాల అపర్ణ జ్యోతి (తిరుపతిపురం, అత్తిలి మండలం), కంతేటి దుర్గభవాని (దెండులూరు మండలం శ్రీరామవరం), అందుగుల లాజర్ తనయుడు నవదీప్ (భీమడోలు మండలం పూళ్ల), నూతుల మార్తమ్మ (భీమడోలు మండలం పూళ్ల), కోరాడ వీర వెంకట సత్యనారాయణ (భీమడోలు మండలం పోలసానపల్లి), చిల్లి సుమతి (యలమంచిలి మండలం దొడ్డిపట్ల) తనయుడు జాన్‌ప్రిన్స్‌కు వైద్యం నిమిత్తం సాయం అందించారు. అలాగే ఎల్లమల్లి అన్నపూర్ణ (నరసాపురం 29వ వార్డు), తేతలి గీత (ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్)కు పరిహారంగా ఆర్థిక సాయం అందజేశారు. కదలి నాగలక్ష్మి (నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల)కి భూపరిష్కారం నిమిత్తం, మరో ఇద్దరికి ఆర్థిక సాయం అందించి ఔదార్యాన్ని చాటారు. అలాగే సీఎం జగన్ గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంలోనూ పలువురు సమస్యలు ఆలకించి తక్షణ సాయం మంజూరు చేశారు. ఆయన మంచి మనసు తమ జీవితాల్లో వెలుగులు నింపిందని, సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామంటూ బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ మేలు మరువలేం

నరాల బలహీనత సమస్యతో చాలా ఇబ్బంది పడేదాన్ని. వైద్యం చేయించుకుందామంటే రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. గతేడాది డిసెంబర్‌లో జగన్ సార్‌ను భీమవరం వెళ్లి కలిశాను. అక్కడ నన్ను ఆయన ఆప్యాయంగా పలకరించి నా సమస్యను అడిగి తెలుసుకున్నారు. వైద్యం, మందుల నిమిత్తం రూ.లక్ష సాయం అందజేశారు. వైద్యం కోసం అధికారులను ఆదేశించారు. దీంతో భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో లక్షలాది రూపాయల వైద్యం ఉచితంగా చేయించారు. ఇప్పుడు ఆరోగ్యంతో కోలుకున్నాను. సీఎం జగన్ సార్ మేలు మరువలేం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నూతలపాటి మార్తమ్మ, పూళ్ల, భీమడోలు మండలం

నా బిడ్డ ఆరోగ్యం జగనన్న చలవే

మా అబ్బాయి జాన్ ప్రిన్స్‌కు ఏడాది వయసు నుంచి కిడ్నీ సమస్య ఉంది. ఐదేళ్లుగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నాం. పేద కుటుంబం కావడంతో రూ.లక్షల్లో అప్పులు చేశాం. గత డిసెంబర్‌లో సీఎం జగన్ సార్ భీమవరం వచ్చిన సమయంలో ఆయన్ను కలిసి మా అబ్బాయి పరిస్థితి వివరించాం. వెంటనే స్పందించి ప్రిన్స్ వైద్యానికి రూ.లక్ష మంజూరు చేశారు. వైద్య బిల్లుల కోసం చేసిన ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షల సాయం తర్వాత అందించారు. దీంతో అప్పులు తీర్చి మెరుగైన వైద్య అందిస్తున్నాం. ప్రస్తుతం ప్రిన్స్ కోలుకుని చదువుకుంటున్నాడు.

– చిల్లే సుమతి, కనకాయలంక, యలమంచిలి మండలం

మా బతుకుకు దారి చూపారు

నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నా భర్త మృతి చెందారు. అప్పటికే మాకు మూడేళ్ల పాప ఉంది. కుటుంబాన్ని పోషించుకునేందుకు దిక్కులేని పరిస్థితుల్లో ఉండగా భీమవరం వచ్చిన సీఎం జగనన్నను కలిశాను. నా దీన స్థితిని చూసి వెంటనే స్పందించారు. తక్షణమే రూ.లక్ష సాయం అందించారు. బతుకుతెరువుకు ఏదైనా ఉద్యోగం చూపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మూడు నెలల్లోనే నాకు నరసాపురం ప్రభుత్వాస్పత్రిలో మహిళా సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇచ్చారు. నెలకు రూ.10,500 జీతం వస్తుంది. పాప 2వ తరగతి చదువుతుంది. జగనన్న చేసిన మేలు వల్లే మేం నిశ్చింతగా బతుకుతున్నాం.

– ఎల్లమల్లి అన్నపూర్ణ, నరసాపురం



నరసాపురానికి చెందిన ఎల్లమల్లి అన్నపూర్ణకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

నా కుమారుడికి నయమైంది

మా అబ్బాయి నవదీప్ ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడు. ఎక్కడపడితే అక్కడ పడిపోయేవాడు. అప్పులు చేసి వైద్యం చేయించినా ఏమాత్రం ఫలితం లేదు. గతేడాది సెప్టెంబర్‌లో 16న కాపు నేస్తం కార్యక్రమానికి నిడదవోలు వచ్చిన సీఎం జగన్‌ను ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు సహకారంతో వెళ్లి కలిశాం. వెంటనే మెరుగైన వైద్యానికి ఆదేశించగా అదేరోజు సాయంత్రం హైదరాబాద్‌లో సిటీ న్యూరో ఆస్పత్రిలో చేర్పించారు. ఐదు రోజుల్లో నవదీప్ సాధారణ స్థితిలోకి చేరుకున్నాడు. సుమారు రూ.3.50 లక్షల ఖర్చును ప్రభుత్వం భరించింది. ఇప్పుడు అందరినీ గుర్తుపట్టడంతో పాటు తోటి పిల్లలతో ఆనందంగా ఆడుకుంటున్నాడు. మందుల నిమిత్తం నెలకు రూ.5 వేలు ఖర్చవుతుండగా గతేడాది డిసెంబర్‌లో భీమవరం వచ్చిన సీఎం జగన్‌ను మరలా కలిస్తే మా బాబుని గుర్తుపట్టి పలకరించారు. మందుల కోసం రూ.లక్ష సాయం అందించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా మా అమ్మాయి భార్గవికి కడుపులో కణితి రాగా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

– అందుగుల జయశ్రీ, పూళ్ల, భీమడోలు మండలం

ర్యాలీ విజయవంతంతో నా గెలుపు ఖాయం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు





ఉంగుటూరు మండలం రాచూరు వద్ద పార్టీ శ్రేణుల ర్యాలీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు. చిత్రంలో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్

ఉంగుటూరు: నామినేషన్ కార్యక్రమంలో వేలాదిగా పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడంతోనే తన గెలుపు ఖాయమైందని వైఎస్సార్‌సీపీ ఉంగుటూరు అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఉంగుటూరులో నామినేషన్ పత్రాలను ఆర్వో ఖాజావలీకి ఆయన సమర్పించారు. వాసుబాబుతోపాటు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ, టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు ఉన్నారు. నామినేషన్ వేసిన అనంతరం వాసుబాబు విలేకరులతో మాట్లాడుతూ సొంతింట్లో వ్యక్తి కన్నా తనను గొప్పగా ప్రజలు చూస్తున్నారని, నామినేషన్‌కు వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించారని అన్నారు. ఇందుకు సీఎం జగన్ పాలనలో తీసుకువచ్చిన మార్పులే కారణమని, ఇందుకు జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. 25 కిలోమీటర్ల ర్యాలీలో మండుటెండను సైతం లెక్కచేయకుండా ఇంతమంది రావడం, ప్రధానంగా మహిళలు రోడ్డుపైకి వచ్చి జేజేలు పలకడం ఆనందంగా ఉందన్నారు. పూర్తిగా ఈసారి అభివృద్ధిపై దృష్టి సారిస్తారన్నారు. 2019 కన్నా ఎక్కువ మెజార్టీ ప్రజలు తనకు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. జగన్ అంటే నమ్మకం, భరోసా అని అన్నారు. సీఎం జగన్‌పై ప్రజలకు అభిమానం పెరిగిందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 70 కిలోమీటర్ల మేర సాగిన సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన వచ్చిందన్నారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ఎంపీ సీట్లు గెలుస్తామని, 160 ఎమ్మెల్యే సీట్లు తక్కువ కాకుండా గెలవడం ఖాయమని చెప్పారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక దానిని మించి మరో నామినేషన్ ఘట్టాలు జరిగాయన్నారు. మూడు కాదు ముప్పై పార్టీలు కలిసినా గెలుపు వైఎస్సార్‌సీపీదే అని అన్నారు. తాను ఎంపీగా గెలుపొందిన తర్వాత కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి ప్రజల గుండెల్లో నిలిచేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

8 నామినేషన్ల దాఖలు

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన గురువారం ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 8 నామినేషన్లు దాఖలయ్యాయని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా కారుమూరి సునీల్‌కుమార్ 2 సెట్లు, వల్లూరు కీర్తి 1 సెట్టు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా కావూరి లావణ్య 2 సెట్లు, పర్వతనేని చైతన్యకుమారి 1 సెట్టు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పుట్టా మహేష్‌కుమార్ 1 సెట్టు, భారతీయ జవాన్ కిసాన్ పార్టీ అభ్యర్థిగా కొండ్రు రాజేశ్వరరావు 1 సెట్టు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కండవల్లి జీవ దేవాదయాకర్ 1 సెట్టు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోడే అజయ్‌బాబు 1 సెట్టు నామినేషన్లు దాఖలు చేశారని కలెక్టర్ చెప్పారు.

89,507 టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులుంటే జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. 08812–230448, 77020 03584, 75695 62076, 75695 97910 నంబర్లకు రైతులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. జిల్లాలో గురువారం వరకు 7,097 మంది రైతుల నుంచి రూ.182.96 కోట్ల విలువైన 89,507 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. చేసినట్లు జె.సి బి.లావణ్యవేణి తెలిపారు. ఇప్పటివరకు 11,356 మంది రైతులకు చెందిన 1,15,933 టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు నమోదు చేసుకున్నారన్నారు.

అందుబాటులో ఎన్నికల పరిశీలకులు

ఏలూరు(మెట్రో): ఎన్నికల సంఘం ద్వారా ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా నియమితులైన తమిళనాడు సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్ఏ రామన్ గురువారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెల్‌లో విభాగాలను పరిశీలించారు. స్వీప్ కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. వీరి వెంట డీఆర్‌ఓ డి.పుష్పమణి ఉన్నారు.

నేరుగా ఫిర్యాదు చేయొచ్చు : ఏలూరు జిల్లా సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఏ రామన్ ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏలూరు కలెక్టరేట్ సమీపంలో రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో అందుబాటులో ఉంటారని ప్రకటనలో తెలిపారు. కృష్ణకాంత్ పాఠక్ ఉదయం 11.30 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత, ఎస్ఏ రామన్ ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత అందుబాటులో ఉండి ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, విజ్ఞప్తులు స్వీకరిస్తారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో కృష్ణకాంత్ పాఠక్ (సెల్ 91546 90377), కైకలూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఎస్ఏ రామన్ (సెల్ 9491041437) అబ్జర్వర్లుగా వ్యవహరిస్తారు.



రామన్‌కు పూలమొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఎన్నికల పోలీసు పరిశీలకుడిగా..

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, జిల్లాలోని ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, పోలవరం, నూజివీడు, కైకలూరు, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పోలీసు పరిశీలకుడు టి.శ్రీధర్ తెలిపారు. ప్రజలంతా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గుర్తిస్తే తనకు ఫిర్యాదు చేసేందుకు ఏలూరులోని జిల్లాపరిషత్ గెస్ట్‌హౌస్‌లోని రూమ్‌నం–8లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 లోపు తనను నేరుగా కలవవచ్చని చెప్పారు. తన సెల్ 9154690388 నంబర్‌కు వివరాలు తెలియజేయవచ్చని సూచించారు.

‘ఓపెన్’ పరీక్షా ఫలితాల విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 1,073 మంది హాజరుకాగా 74 మంది, ఇంటర్ పరీక్షలకు 1,619 మంది హాజరుకాగా 415 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు అభ్యర్థులు ఈనెల 29 నుంచి వచ్చేనెల 10 వరకు పరీక్షలు చెల్లించవచ్చని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8 వరకు నిర్వహిస్తారని, ఇంటర్ ప్రాక్టికల్స్ జూన్ 10వ తేదీ నుంచి నిర్వహిస్తారన్నారు. పదో తరగతి అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్ సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాలని తెలిపారు. అపరాధ రుసుంతో వచ్చే నెల 10వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

వర్జీనియా.. ధర అదిరిందయ్యా

కిలో రూ.303.. ఆల్‌టైమ్ రికార్డు



వర్జీనియా పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: రికార్డ్.. రికార్డ్.. వర్జీనియా పొగాకు ధర చరిత్రలోనే రికార్డు సాధించింది. ఎన్నడూ లేనివిధంగా కిలో ధర రూ.303 లభించింది. దీంతో రైతుల మోముల్లో ‘ధర’హాసం కనిపిస్తోంది. వర్జీనియా రైతులంతా ఆనందంతో ఉప్పొంగుతున్నారు. గతేడాది అత్యధికంగా కిలోకి రూ.288 లభించింది. అప్పట్లోనే ఇది రికార్డు ధర కాగా, తాజాగా ఆ రికార్డును బ్రేక్ చేసి కిలో ధర రూ.303 లభించింది. ఈ ఏడాది తుపాను కారణంగా వర్జీనియా పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో రైతులు దెబ్బతిన్న పంటల స్థానంలో రెండోసారి పంటలు వేయాల్సి వచ్చింది. అయితే అంతర్జాతీయంగా పొగాకు పంట ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో స్థానికంగా ఉన్న దేశీయ పొగాకుకు డిమాండ్ పెరిగింది. అందుకు అనుగుణంగా ఎగుమతుల ఆర్డర్లు కూడా రావడంతో వర్జీనియా ధర అ‘ధర’హో అనిపిస్తోంది.

ఐదు వేలం కేంద్రాల్లో.. ఈ ఏడాది మార్చి 6న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం–1,–2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల్లో వర్జీనియా వేలం ప్రారంభమైంది. ప్రారంభ ధర కిలోకు రూ.240 లభించింది. ఇది క్రమేపీ పెరుగుతూ ఏప్రిల్ 20న రూ.266, 22న రూ.272, 24న రూ.287 పలికింది. గురువారం ఒక్కసారిగా కిలోకి రూ.16 పెరిగి ఆల్‌టైం గరిష్ట ధర రూ.303 కు చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో దేవరపల్లి, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల్లో వర్జీనియా కిలో ధర రూ.303 లభించగా, జంగారెడ్డిగూడెం–1వ వేలం కేంద్రంలో రూ.302, 2వ వేలం కేంద్రంలో రూ.301 పలికింది. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ఇదిలా ఉంటే వర్జీనియా ధర ఆశించిన స్థాయి కన్నా ఎక్కువ లభిస్తుందని, లోగ్రేడ్, మధ్య తరగతి గ్రేడ్ పొగాకును రైతులు వేగంగా వేలం కేంద్రాలకు తరలించుకుని అమ్ముకోవాలని పొగాకు బోర్డు అధికారులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో మంచి గ్రేడ్‌కు మరింత ఎక్కువ లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, దేవరపల్లి వేలం కేంద్రానికి గురువారం 330 బేళ్లు, జంగారెడ్డిగూడెం–1వ కేంద్రానికి 839, జంగారెడ్డిగూడెం–2వ కేంద్రానికి 322, కొయ్యలగూడెం కేంద్రానికి 638, గోపాలపురం కేంద్రానికి 1,004 బేళ్లు వేలానికి వచ్చాయి.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

భీమవరం : బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎంఎస్ నగర్‌కు చెందిన కె.గౌరీ నాయుడు (55), కొవ్వాడపుంతకు చెందిన కె.శివ బైక్‌పై బుధవారం రాత్రి వెళుతుండగా ఉండి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో గౌరీనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, శివ గాయాలపాలై చికిత్స పొందుతున్నాని ఎస్సై జి.ప్రసాద్ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ పేదల పక్షం

- పార్టీ ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరు 11వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం


ఏలూరు దక్షిణపువీధిలో ఎన్నికల ప్రచారంలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోందని, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే టీడీపీ, జనసేనలోని పెత్తందార్లు తట్టుకోలేక అడ్డుకున్నారని, ఎన్నికల రావటంతో చంద్రబాబు కూడా సంక్షేమ పథకాలు ఇస్తానంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని, ఆయన మాటలు ప్రజలు నమ్మవద్దని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, పార్టీ నాయకులు కోయ సత్తిబాబు ఆధ్వర్యంలో దక్షిణపువీధి పెద్ద అమ్మవారి గుడి నుంచి ఎమ్మెల్యే నాని గురువారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. డివిజన్‌లోని ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున ఆళ్ల నానికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ పాదయాత్రగా వెళుతూ ప్రజలతో మమేకం అవుతూ ఓట్లు అభ్యర్థించారు. మళ్లీ పేదల ప్రభుత్వం రావాలంటే సంక్షేమ పథకాలు పక్కాగా అమలు కావాలంటే ఫ్యాన్ గుర్తుపై తనకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు వేసి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే నాని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 58 నెలల కాలంలో ఏలూరు నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ఏలూరు నగరంలో 90 వేల కుటుంబాలు ఉంటే వాటిలో సుమారుగా 70 వేల కుటుంబాలకు సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే జమ చేశామని ఎమ్మెల్యే నాని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కురెళ్ల రాంప్రసాద్, దాసరి వరలక్ష్మి, నీతా జైన్, సామర్ల కిరణ్, బుద్దాల రాము, మోర్త రంగారావు, ఆలా గణేష్, అత్తులూరి సూర్యకుమారి, కార్పొరేటర్ తంగెళ్ల రాము తదితరులు ఉన్నారు.

అభివృద్ధి సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

వట్లూరు ప్రచారంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


వట్లూరులో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వట్లూరులోని నెహ్రూనగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ, సీతారామపురం, శౌరిపురం ప్రాంతాల్లో ఫ్యాను గుర్తుపై ఓటేయాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి, ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా భావించి సీఎం వైఎస్ జగన్ పరిపాలన చేశారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రభుత్వ సేవలను వేగవంతం చేశారన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా, సమర్థవంతగా అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు నేరుగా బ్యాంక్ ఖాతాలకు సొమ్ము జమచేశారన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛను సొమ్ము అందించి అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు, రోగులకు అండగా నిలిచారన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాక నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారన్నారు. పేదలందరికీ విద్య, వైద్యాన్ని అందిస్తే జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట వేశారన్నారు. నాడు-నేడు ప్రవేశపెట్టి బడులు, ఆసుపత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. పేదలకు ఆరోగ్యానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా ఉండేందుకు రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వర్తింపచేశారన్నారు. గతంలో ఏనాడైనా ఈ విధంగా పథకాలు అందించారా అంటూ ప్రశ్నించారు. జగన్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్ చౌదరి, ఏఎంసీ చైర్మన్, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు ముదుగురు సూర్యనారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, సీనియర్ నాయకులు ఎన్.సుదీర్‌కుమార్, స్థానిక సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, ఎంపీటీసీ మాగంటి ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ మధుసూదనరావు, బెజవాడ శేఖర్, బెజవాడ నర్సింహరావు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో రాట్నాలమ్మ దర్శనం


పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


సరస్వతీదేవి అలంకరణలో రాట్నాలమ్మవారు

పెదవేగి : శ్రీరాట్నాలమ్మ తిరునాళ్లల్లో భాగంగా మూడోరోజు అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాట్నాలకుంటలోని అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి పుష్పయాగోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ నవగ్రహ మండపార్చన, పరిసర దేవాతార్చన శ్రీ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఉదయం 8 గంటలకు హనుమాన్ చాలీసా, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన మంగళహారతి మంత్రపుష్పం, ప్రసాదవితరణ చేశారు. ఏలూరు వారిచే మ్యాజిక్ షో, రాత్రి 7 గంటలకు సహస్ర కమల పూర్వక సువర్ణ పుష్పోత్సవం జరిపారు. ఆసన్నగూడెం వారిచే దుర్యోధన ఏకపాత్రాభినయం, రాత్రి 8 గంటలకు సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం భక్తులను అలరించింది. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం


ఈఓ త్రినాథరావుకు విరాళం చెక్కును అందజేస్తున్న దాత రత్నాకరరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.10 లక్షలను విరాళంగా అందజేశారు. విజయవాడలోని కరెన్సీ నగర్‌కు చెందిన కేతినేని రత్నాకరరావు, లక్ష్మీ శమంతకమణి దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ విరాళం చెక్కును శమంతకమణి తాతయ్య, నాన్నమ్మ అయిన నందివాడ మండలం రామాపురానికి చెందిన కీర్తిశేషులు నెక్కంటి ఆదినారాయణ, మాణిక్యామ్మ దంపతుల జ్ఞాపకార్థం ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆయన విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కంప్యూటేషనల్ ల్యాబ్‌ను ప్రారంభించిన చాన్సలర్


నూజివీడు ట్రిపుల్ ఐటీలో కంప్యూటేషనల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలోని సెంట్రల్ లైబ్రరీలో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటేషనల్ ల్యాబరేటరీని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి గురువారం ప్రారంభించారు. దీనిలో భాగంగా అధిక కాన్ఫిగరేషన్ కలిగిన 60 డెస్క్‌టాప్‌లను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ విద్యార్థులకు సాంకేతికత, కంప్యూటింగ్‌కు చెందిన విభిన్న కోణాలతో సంభాషించడానికి దోహదపడుతుందన్నారు. హ్యాండ్ ఆన్ లెర్నింగ్, డేటా విశ్లేషణ, విజువలైజేషన్, నెట్‌వర్కింగ్, రీసెర్చ్ తదితర అంశాల్లో విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు, సెంట్రల్ ఏవో జీ భానుకిరణ్, సెంట్రల్ డీన్ దువ్వూరు శ్రావణి, ఏవో టీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా భక్తులను మోసం చేసిన మోదీ ప్రభుత్వం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ వారిని మోదీ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని ఆర్యవైశ్య నాయకుడు పైడి భీమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నర్మదా నది పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తమ ప్రాంతాల నుంచి వెళ్లే రైళ్లలో నాలుగు నెలల కిందటే రిజర్వేషన్లు చేయించుకున్నారని తెలిపారు. అయితే ఏపీ ఎక్స్‌ప్రెస్, అహల్య ఎక్స్‌ప్రెస్ రైళ్లను మోదీ ప్రభుత్వం అర్ధాంతరంగా రూటు మార్చి విజయనగరం, రాయగడ, నాగపూర్ మీదుగా తిప్పే ఏర్పాటు చేసినట్లు రిజర్వేషన్లు చేయించుకున్న భక్తులకు మెసేజ్‌లు పంపిందన్నారు. రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా నర్మదా పుష్కరాల కోసం నాలుగు నెలలకు ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్న అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, వరంగల్లు, రామగుండం తదితర ప్రాంతాల భక్తులకు దారులు మూసుకుపోయాయన్నారు. ఇప్పటికిప్పుడు ఏ ఇతర రైళ్లలోనూ రిజర్వేషన్లు దొరకవని, 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కర స్నానాలకు ప్రభుత్వం దూరం చేసి భక్తుల విశ్వాసంపై దెబ్బకొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆంధ్రా భక్తుల మనోభావాలను గౌరవించి ఏపీ ఎక్స్‌ప్రెస్, అహల్య ఎక్స్‌ప్రెస్ రైళ్లను యథాతథంగా తిప్పాలని, లేని పక్షంలో రిజర్వేషన్లు చేయించుకున్న భక్తులకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లను రైల్వే అధికారులు చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరు


కైకలూరులో ఆత్మీయ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఓటర్లను కొనుగోలు చేయడానికి అమెరికా నుంచి తీసుకువస్తున్న డబ్బు సంచులను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో కైకలూరులో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రాజీనామా చేసిన వలంటీర్లతో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పెత్తాందారీ వర్గానికి చెందిన కామినేనిని ఓటు రూపంలో ప్రజలు ఓడించాలన్నారు. రెండు రోజుల్లో సీఎం వైఎస్ జగన్ జనరంజక మేనిఫెస్టోను విడుదల చేయనున్నారని, దీనిని ఇంటింటికి చేరవేయాలన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థి కామినేని ఓటమి తథ్యమన్నారు. కొల్లేరు గ్రామాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారన్నారు. కూటమి నాయకులు ఎన్నికుట్రలు చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. నాయకులు బీవీ రావు మాట్లాడుతూ అఖరి ఎన్నికలు అని చెప్పి దేవుళ్ల మీద ఓట్టు వేయడం కామినేనికి అలవాటే అన్నారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ విజయాలను ఎవరూ ఆపలేరన్నారు. పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు మాట్లాడుతూ కొల్లేరు ప్రజల ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయంలో కీలకంగా మారుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు ముంగర నరసింహారావు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, రాష్ట్ర, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, పీఏసీఎస్ అధ్యక్షులు పంజా రామారావు, గురజాల వేణు, బలే సముద్రుడు, కో-ఆప్షన్ సభ్యులు శ్యామ్‌సుందర్, నాయకులు శేషావతారం, జగన్నాథం, జయదేవ్, బండి ప్రసాద్, మన్నేపల్లి ఆదాం, నల్లగచ్చు బాబులు, ఘంటసాల సురేష్, వివిధ గ్రామాల సర్పంచులు తలారి మణిమ్మ, ఘంటసాల శేషారావు, చెరుకువాడ బలరామరాజు, కొయ్యే గంగయ్య, ముంగర రామకృష్ణంరాజు, అల్లూరి మంగరావు, గరికిముక్కు మరియమ్మ, ఉప్పలపాటి నాగమణి, నున్న రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం మైనార్టీ యువకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల చేరికలు రోజురోజుకూ వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులమై ఆ పార్టీలో చేరుతున్నామని ఈ సందర్భంగా వారు చెబుతున్నారు. గురువారం ఏలూరు 46, 47 డివిజన్లలో ముస్లిం యువత ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 46వ డివిజన్‌లో షేక్ నాగూర్, 47వ డివిజన్‌లో మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జలీల్ ఆధ్వర్యంలో 100 మందికి పైగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాని వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించగా, సీఎం వైఎస్ జగన్ అదే స్థాయిలో ముస్లింలకు అండగా నిలిచారని చెప్పారు. నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు రియాజ్ ఆలీఖాన్, నేతలు ఖాజా, అక్బర్, అమీను, సలీమ్, మొహిద్దీన్, ఇలియాస్, గంటా మహేష్, పండు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి ముస్లిం కుటుంబాలు


చంటినాయన సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు

నూజివీడు: టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పే మాయమాటలు నమ్మితే రాష్ట్రం 30ఏళ్లు వెనక్కు పోయినట్లేనని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు చంటినాయన) అన్నారు. పట్టణంలోని మూడో వార్డుకు చెందిన 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. షేక్ రెహమాన్, షేక్ షాకీర్, షేక్ హుస్సేన్, షేక్ జానీ, రెహమాన్, షేక్ షఫీ, షేక్ ఆసీఫ్, హుస్సేన్, బషీర్, మహమ్మద్ షఫీ కుటుంబాలు పార్టీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి, సీఎం వైఎస్ జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేయడానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వెఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ యూనస్‌పాషా (గబ్బర్), మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌కు ఐదేళ్ల జైలు

ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి తీర్పు

ఏలూరు (టూటౌన్): ఒంటరి మహిళను పెట్రోల్ పోసి చంపేస్తానని బెదిరించిన కేసులో నేరం రుజువు కావడంతో రేషన్ డీలర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ డీఈ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పట్టణానికి చెందిన తూము రాఘవేంద్ర అవినాష్ బాబు రేషన్ డీలర్. అతనికి చెందిన డిపోలో రేషన్ సరుకులు తీసుకోవడానికి ఓ వివాహిత వెళ్లగా, ఆమె సెల్ నంబర్ తీసుకుని తరచూ ఫోన్లు చేయడంతో ఆమె భర్తకు తెలిసి విభేధాలు వచ్చి విడాకులు తీసుకున్నారు. తరువాత బాధిత మహిళ తాడేపల్లిగూడెంలోని తన సోదరుడు ఇంటి వద్ద ఉంటూ ఒక బట్టల షాపులో సేల్స్ గర్ల్‌గా చేరింది. ఇది తెలుసుకున్న రాఘవేంద్ర అవినాష్‌బాబు తాడేపల్లిగూడెంలోని బాధిత మహిళ వద్దకు వెళ్లి తన వల్లే కాపురం పోయిందని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. బాధిత మహిళ సోదరుడు, పెద్దల వద్ద ఆమెను వివాహం చేసుకుంటానని ఒప్పుకున్నాడు. బాధితురాలికి విడాకుల కారణంగా వచ్చిన రూ.మూడు లక్షల నగదును కూడా నిందితుడు వ్యాపారంలో పెట్టుబడి కోసం తీసుకుని మోసం చేశాడు. అయితే వివాహం చేసుకోమని బాధితురాలు నిందితుడిని కోరగా ఇంకోసారి వివాహం చేసుకోవాలని అడిగితే పెట్రోల్ పోసి చంపేస్తానని బెదిరించి భయాందోళనకు గురిచేశాడు. దీనిపై బాధితురాలు 2019 జూన్ 14న తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై బి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి జి.రాజేశ్వరి తీర్పు వెలువరించారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

పాలకొల్లు సెంట్రల్: బైక్‌పై వెళుతూ ఓవర్‌టేక్ చేస్తూ ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. లంకలకోడేరు పెదపేటకు చెందిన కె.శ్రీజు (21), యన్నాబత్తుల బన్నీ ఇద్దరూ గురువారం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పాలకొల్లు వెళ్లి తిరిగివస్తున్నారు. పాలకొల్లు - పామర్రు (భీమవరం) ప్రధాన రహదారిలో భగ్గేశ్వరం గ్రామం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను అధిగమించే ప్రయత్నంలో ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీజు అక్కడికక్కడే మృతి చెందగా, బన్నీకి తీవ్రగాయాలయ్యాయి. బన్నీని స్థానిక ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు తెలిపారు.